సాక్షి మెదక్

శుక్రవారం । 25 । జూలై । 2025



మీసేవకు మరో 9 సర్వీసులు

మీ-సేవకు ప్రభుత్వం కొత్తగా మరో తొమ్మిది రకాల సేవలను అప్పగించింది.

వివరాలు 8లో ▸



మందు బాబు.. మారవా..?

జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తున్నా, మందుబాబుల్లో ఏ మాత్రం మార్పు కనిపించడం లేదు. వివరాలు 8లో ▸

సింగూరుకు వరద

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతుంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి భారీగా వరద చేరుతుంది. గురువారం ఉదయం డ్యాంలోకి 4,683 క్యూసెక్కులు, మధ్యాహ్నం 1,883, సాయంత్రం 2,994 క్యూసెక్కుల నీరు చేరిందని ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

న్యూస్‌రీల్

వివరాలు పక్కాగా నమోదు చేయాలి



పీఎం ఆవాస్ యోజన సర్వేను పరిశీలిస్తున్న పీడీ చలపతిరావు

వట్‌పల్లి(అందోల్): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలు పీఎం ఆవాస్ యోజన యాప్‌లో పక్కాగా నమోదు చేయాలని హౌసింగ్ పీడీ చలపతిరావు అన్నారు. గురువారం అందోల్ మండల పరిధిలోని చింతకుంటలో చేపడుతున్న పీఎం ఆవాస్ యోజన సర్వేను పరిశీలించారు. వివరాల నమోదులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివరాలు నమోదు చేసే సమయంలో లబ్ధిదారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాజేశ్‌కుమార్, ఎంపీఓ సోమ్‌నారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీవిద్య ఉన్నారు.

'మత పరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం'

మెదక్‌జోన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తుంది, కానీ బీసీల ముసుగులో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించటం ఎంతవరకు సమంజసమని ఆపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిశోర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సర్కార్ బీసీలకు తీరని అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. బీజేపీ ఎప్పుడూ బీసీలకు వ్యతిరేకం కాదని, మోదీ కేబినెట్‌లో ఎంతో మంది బీసీలు ఉన్నారని గుర్తుచేశారు. బీసీల మీద ప్రేమ ఉన్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం నటిస్తోందని, అదే నిజమైతే కేబినెట్‌లో ఎంత మంది బీసీలు ఉన్నారో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నేతలు ఎంఎల్ఎన్ రెడ్డి, సుభాష్‌గౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి యూరియా వాడొద్దు: ఏడీఏ

రామాయంపేట(మెదక్): అధిక మోతాదులో యూరియా వాడితే పంట దిగుబడి తగ్గడంతో పాటు భూసారం దెబ్బతింటుందని ఏడీఏ రాజ్‌నారాయణ అన్నారు. గురువారం మండలంలోని కోనాపూర్‌లో జీలుగ సాగుచేస్తున్న పలు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. పచ్చిరొట్ట ఎరువు వినియోగంతో దీర్ఘకాల ప్రయోజనాలున్నాయని, సీజన్‌కు ముందే రైతులకు 50 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశామన్నారు. మండలంలో మొత్తం 276 క్వింటాళ్ల మేర విత్తనాలు అమ్ముడుపోయాయని వివరించారు. తక్కువ మోతాదులో యూరియా వాడాలని తాము మండలాల వారీగా రైతులను చైతన్యపరుస్తున్నామని వివరించారు.

పూర్తిస్థాయి నష్టపరిహారం ఇవ్వాలి

పటాన్‌చెరు టౌన్: సిగాచీ పరిశ్రమలో ఘోర ప్రమాదం జరిగి 25 రోజులు దాటిందని, ఒక్కో కార్మిక కుటుంబానికి రూ. కోటి ప్రకటించి, ప్రస్తుతం రూ. 10 లక్షలు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్ ధ్వజమెత్తారు. గురువారం ఆయన మాట్లాడుతూ... మిగిత డబ్బులు దశలవారీగా ఇస్తామనడం దారుణం అన్నారు. తక్షణమే పూర్తిస్థాయి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆచూకీ దొరకని కార్మిక కుటుంబాలకు రూ. 15 లక్షలు ఇచ్చి, వారిని స్వస్థలాలకు పంపించారని. బాధిత కుటుంబాలకు పూర్తిస్థాయిలో నష్ట పరిహారం అందించడంలో అధికారులు, యాజమాన్యం నిర్లక్ష్యం చేయటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నర్సాపూర్ రూరల్: కొడిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ అదెప్ప గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ 1, కామర్స్ 1, ఇంగ్లీష్ 1, బోటని 1, కెమిస్ట్రీ 1, ఎకనామిక్స్ 1, తెలుగు 1 పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెట్, నెట్, పీహెచ్‌డీతో పాటు బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. బీసీలు 55 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. నేడు, రేపు కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28 రోజు నిర్వహించే డెమో క్లాసులకు హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు.

3 రోజులుగా ముసురే



మెదక్ మండలంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

ఆరుతడి పంటలకు జీవం
- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- ఇప్పటివరకు 1.20 లక్షల ఎకరాల్లో సాగు

మెదక్‌జోన్: జిల్లాను మూడు రోజులుగా ముసురు వీడడం లేదు. ఫలితంగా వర్షాధారంగా సాగు చేసిన వేలాది ఎకరాల ఆరుతడి పంటలకు ప్రాణం పోసినట్లు అయింది. వరినాట్లు సైతం జోరందుకున్నాయి. అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 3.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 1,20,889 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో వరి 3.05 లక్షల ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 81,892 ఎకరాలు మాత్రమే సాగైంది. ఆరుతడి పంటలైనా పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, ఆయిల్ పాం, మినుములు తదితర పంటలు 38,997 ఎకరాల్లో సాగయ్యాయి. కాగా ఈనెల రెండోవారం వరకు సరైన వర్షాలు కురవకపోవటంతో ఆరుతడి పంటలకు సరిపడా నీటి తడులు లేక కర్షకులు ఆందోళన చెందారు. మూడు రోజులుగా ఎడతెరిపి లేని ముసురుతో పంట పొలాల్లో నీరు నిలిచింది. ముఖ్యంగా పత్తికి ఈ వాన ఊపిరిపోసినట్లు అయిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బోరువుల ఆధారంగా ఇప్పటికే చాలా వరకు వరినాట్లు వేశారు. చెప్పుకోదగ్గ వర్షాలు కురవకపోవటంతో చెరువులు, కుంటల్లోకి నీరు రాకపోవటంతో ఆయకట్టు భూముల్లో నాట్లు అంతంత మాత్రంగానే వేశారు.

వరి సాగు అధికమే..

కాగా గత ఖరీఫ్‌తో పోలిస్తే ఈసారి వరిసాగు అధికంగా సాగైనట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. గతేడాది జూలై 24 వరకు వరి జిల్లాలో 65,890 ఎకరాలు మాత్రమే సాగైంది. ప్రస్తుతం వరి సాగు 81,892 ఎకరాలు అయింది. ఈలెక్కన గతేడాదితో పోలిస్తే 16 వేల ఎకరాల పైచిలుకు అధికంగా సాగు అయిందని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. కాగా సాగుకు అదను దాటిపోలేదని ఆగస్టు నెలాఖరు వరకు నాట్లు వేసినా దిగుబడిలో ఏ మాత్రం వ్యత్యాసం ఉండదని వ్యవసాయశాఖ స్పష్టం చేసింది.

8 మండలాల్లో లోటు వర్షపాతం

జిల్లావ్యాప్తంగా 21 మండలాల్లో లోటు వర్షపాతం నమోదు అయింది. ఇప్పటివరకు 276.8 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, 238.5 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసింది. ఈలెక్కన 38.5 మిల్లీ మీటర్ల వర్షం తక్కువగా నమోదైంది. వీటిలో ప్రధానంగా రేగోడు, నర్సాపూర్, కొడిపల్లి, పెద్ద శంకరంపేట, చిన్నశంకరంపేట, పాపన్నపేట, మాసాయిపేట, మనోహరాబాద్ మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కాగా, మిగితా 12 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు అయింది. ఒక్క రామాయంపేట మండలంలో మాత్రం సాధారణం కన్నా ఎక్కువగా వర్షం కురిసింది. రామాయంపేట మండలంలో 268.9 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, ఇప్పటివరకు 364.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

పోచారం డ్యామ్‌కు పోటెత్తిన వరద

మెదక్– కామారెడ్డి జిల్లా సరిహద్దులో ఉన్న పోచారం డ్యామ్‌కు వరద ఉధృతి పెరుగుతుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాటు కామారెడ్డి జిల్లాలో కురిసిన వర్షాలతో మండల పరిధిలోని రాజ్‌పేట గంగమ్మవాగు ద్వారా పోచారం డ్యామ్‌లోకి నీరు చేరుతుంది. జూన్‌లోనే పొంగిపొర్లే పోచారం ఈసారి వర్షాలు సరిగా లేకపోవడంతో నిండలేదు.

హవేళిఘణాపూర్(మెదక్):



రాజ్‌పేట వద్ద గంగమ్మ వాగు వరద ఉధృతి

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు



పాలిటెక్నిక్ కళాశాల వద్ద నిర్మించిన బస్టాండ్‌ను పరిశీలిస్తున్న మంత్రి దామోదర

మంత్రి దామోదర రాజనర్సింహ

జోగిపేట(అందోల్): ఆందోలు మండలంలోని పోతిరెడ్డిపల్లి శివారులో ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసే ఆలోచన ఉందని, దీంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం అందోలు వద్ద నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల, 150 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. మరో ఏడాదిలో నియోజకవర్గ రూపురేఖలు మారిపోతాయన్నారు. ఫోర్‌లేన్ రోడ్డు పనులు కూడా పూర్తి కావొస్తున్నాయని తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి లైటింగ్ ఏర్పాటు చేయాలని రోడ్లు భవనాల శాఖ డిప్యూటీ ఈఈ రవీందర్‌ను ఆదేశించారు. పాలిటెక్నిక్ కళాశాల వద్ద నిర్మించిన రెండు బస్టాప్‌లను పరిశీలించారు. అందోలు ప్రధాన రహదారి వద్ద ఉన్న బురుజు క్రాసింగ్ వద్ద ఇళ్ల తొలగింపుపై ఆర్డీఓ పాండుతో మాట్లాడారు. రోడ్డు విస్తరణలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకూడదన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్, మంత్రి కూతురు త్రిష, మాజీ కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, హరికృష్ణాగౌడ్, మునిపల్లి ఎంపీపీ మాజీ అధ్యక్షుడు రాంరెడ్డి, ఆత్మకమిటీ డైరెక్టర్ ఖాలేద్, మైనార్టీ నాయకుడు చోటూ ఖాన్‌లతో పలువురు పాల్గొన్నారు.

త్వరగా ఆస్పత్రి నిర్మాణం పూర్తిచేయాలి

వట్‌పల్లి(అందోల్): ఆస్పత్రి నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టి పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం వట్‌పల్లిలో చేపడుతున్న 30 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో అవసరమైన చోట పీహెచ్‌సీలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రమేశ్‌జ్యోషి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్‌గౌడ్, వెంకట్‌పాటిల్, ఏఎంసీ డైరెక్టర్ దిగంబర్‌రావు, మాజీ ఎంపీటీసీ నర్సింలు, సుధాకర్‌తో పాటు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల ప్రగతి



కేక్ కట్ చేస్తున్న పద్మారెడ్డి, నాయకులు

ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి

రామాయంపేట(మెదక్): బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని ఆపార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి అన్నారు. గురువారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా రామాయంపేట పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మాట్లాడారు. రాష్ట్ర సాధనలో అలుపెరుగని పోరాటం చేసిన కేటీఆర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మంత్రిగా ఎన్నో కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటు చేయడంతో పాటు వాటి అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కాంగ్రెస్ కబంధ హస్తాల్లో నుంచి రాష్ట్రాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు బాదె చంద్రం, మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, పార్టీ యూత్ విభాగం మండలాధ్యక్షుడు జలందర్, మాజీ సర్పంచ్ పాతూరి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు చివరి అవకాశం

మెదక్ కలెక్టరేట్: దోస్త్‌లో చివరి దశ అడ్మిషన్లు గురువారం ప్రారంభించినట్లు మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థులు ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్లు ఇవ్వాలన్నారు. ఆగస్టు 3న సీటు కేటాయిస్తామన్నారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులు ఆగస్టు 4 నుండి 6 మధ్య తమ సీటును ఖరారు చేసుకునేవిధంగా కళాశాలలో ప్రత్యక్షంగా రిపోర్ట్ చేయాలన్నారు. ఇంకా డిగ్రీలో చేరని విద్యార్థులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

నేడు మెగా జాబ్‌మేళా

మెదక్ కలెక్టరేట్: నేడు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు డీఐఈఓ మాధవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌సీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాను ఇంటర్‌లో ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, బైపీసీ, ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ రాహుల్ రాజ్ హాజరవుతారని తెలిపారు.

నారింజకు 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జహీరాబాద్: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో గల నారింజ ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో షటర్లకు రెండు ఇంచుల మేర నీరు తక్కువగా ఉండగా, వర్షాలు కురుస్తుండడంతో నీరు చేరుతోంది. ఇప్పటికే ప్రాజెక్టులో సామర్థ్యం మేరకు నీరు ఉండగా, బయటకు వెళుతోంది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 500 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో సైతం అంతేస్థాయిలో ఉంది. షటర్ల పై నుంచి రెండు ఇంచుల మేర నీరు దిగువన ఉన్న కర్నాటకలోకి వెళుతోంది.

ఖేడ్ అభివృద్ధికి రూ. 60 కోట్లు విడుదల

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నారాయణఖేడ్: నియోజకవర్గంలో ఆయా అభివృద్ధి పనుల కోసం రూ. 60 కోట్లు మంజూరయ్యాయని, మరో రూ. 280 కోట్లు త్వరలో మంజూరు కానున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీఐ నిర్మాణం కోసం రూ. 45 కోట్లు విడుదల అయ్యాయని తెలిపారు. మోర్గి వద్ద గత ప్రభుత్వ హయాంలో అర్ధాంతరంగా నిలిచిన వంతెన నాసిరకంగా నిర్మించడంతో దాన్ని తొలగించి జాతీయ రహదారుల నాణ్యతతో కొత్త వంతెన కోసం రూ. 6.50 కోట్లు, నమ్లిమెట్– పోతన్‌పల్లి మధ్య వంతెన కోసం రూ.1.40 కోట్లు పీఎంజీఎస్వై కింద మంజూరైనట్లు తెలిపారు. ఖేడ్– కరస్‌గుత్తి, ఖేడ్– రాయిపల్లి రోడ్ల తాత్కాలిక మరమ్మతులకు రూ.1.50 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. హ్యామ్ ద్వారా రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి ప్రధాన రోడ్లు, ప్రధాన రోడ్ల నుంచి గ్రామాలు, తండాలకు రోడ్ల కోసం రూ. 280 కోట్లతో ప్రతిపాదనలు పంపగా, త్వరలో మంజూరు కానున్నాయన్నారు. నిధులు మంజూరైన పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కొనసాగుతుండగా, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని వివరించారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ పాటిల్, మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ దారం శంకర్, ముఖ్యనాయకులు పండరిరెడ్డి, అవుటి శంకర్, దత్తుగౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

కలెక్టర్ రాహుల్‌రాజ్



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం సాయంత్రం వెల్దుర్తి పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పీఏసీఎస్ ఎరువుల విక్రయ కేంద్రం, ప్రాథమిక ఆస్పత్రి, బాలుర సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులను పలు ప్రశ్నలు అడగగా, వారు సరైన సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. డిజిటల్ బోర్డు నిర్వహణ, ఉపాధ్యాయుల బోధన బాగుందని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. వానాకాలం సీజన్‌కు సరిపడా జిల్లాలో యూరియా అందుబాటులో ఉందన్నారు. కృత్రిమ కొరత సృష్టించినా, యూరియాను పక్కదారి పట్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. పనులు ప్రారంభించని లబ్ధిదారులు ఈ నెల చివరిలోపు ప్రారంభించాలని, లేని పక్షంలో వారి పేరు జాబితా నుంచి తొలగించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ జయచంద్రారెడ్డి, ఎంఈఓ యాదగిరి, ఏఓ ఝాన్సీ తదితరులు ఉన్నారు.

29న సమాచార కమిషనర్ల రాక

మెదక్ కలెక్టరేట్: సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం గురించి పౌర సమాచార అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టం రిసోర్స్ పర్సన్ యూసఫ్ అలీ ఆధ్వర్యంలో అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 29న రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్, సమాచార కమిషనర్లు జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు. జిల్లాలో ఆర్టీఐ పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, డీఆర్ఓ భుజంగరావు, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీఓలు మహిపాల్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, రమాదేవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

రింగ్ రైలు కూత

ఉమ్మడి జిల్లాలో 120 కి.మీ. విస్తరణ



హైదరాబాద్ ఔటర్ రింగు రైలుకు అలైన్‌మెంట్ ఖరారు కావడం.. ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధికి మరో కీలక అడుగుగా మారింది. ట్రిపుల్‌ఆర్ (రీజినల్ రింగు రోడ్డు)కు సమాంతరంగా 392కిలోమీటర్ల మేర ఈ అలైన్‌మెంట్ ఉండగా.. ఇందులో ఉమ్మడి జిల్లాలోనే 120కిలోమీటర్ల మేర విస్తరించే అవకాశాలున్నాయి. హైదరాబాద్‌కు ఈ ప్రాంతం సమీపంలో ఉండటం వల్ల భారీ ప్రయోజనాలు చేకూరి బహుముఖ అభివృద్ధికి బాటలు పడనున్నాయి. – గజ్వేల్

- కీలకంగా మారనున్న గజ్వేల్ రైల్వేస్టేషన్
- హైదరాబాద్ స్టేషన్లకు ప్రత్యామ్నాయంగా విస్తరించే అవకాశం
- 'మల్టీమోడల్ లాజిస్టిక్ హబ్' అభివృద్ధికి మార్గం

ఉమ్మడి మెదక్ జిల్లా (సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి) తోపాటు వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, యాదాద్రి జిల్లాల మీదుగా రింగు రైలు అలైన్‌మెంట్ ఖరారైంది. ట్రిపుల్‌ఆర్ (రీజినల్ రింగు రోడ్డు)కు సమాంతరంగా 3.5కిలోమీటర్ల దూరంలో, ఒకటి రెండు చోట్ల మాత్రం 11కిలోమీటర్ల దూరంలో అలైన్‌మెంట్‌ను సిద్ధం చేశారు. ఈ భారీ ప్రాజెక్ట్ వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాకు జరిగే ప్రయోజనంపై జిల్లా వాసుల దృష్టి కేంద్రీకృతమై ఉంది. ఔటర్ రింగు రైలు ప్రాజెక్టులో భాగంగా ఆరు చోట్ల ఆర్ఓఆర్(రైల్ ఓవర్ రైల్) వంతెనలు రానున్నాయి. ఈ ఆర్ఓఆర్ గజ్వేల్‌లో రానుందని ప్రకటనలు వెలువడ్డాయి. జగదేవ్‌పూర్, గజ్వేల్, తూప్రాన్, నర్సాపూర్, సంగారెడ్డి ప్రాంతాల మీదుగా ఈ రింగు రైలు విస్తరించే అవకాశాలున్నాయి.

గజ్వేల్ స్టేషన్ కీలకం!

రింగు రైలు ప్రాజెక్ట్‌లో మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వేలైన్‌పై ఉన్న గజ్వేల్ రైల్వే స్టేషన్ కీలకంగా మారనుంది. ప్రస్తుతం మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు 151.36కిలోమీటర్ల పొడవున ఈ న్యూబ్రాడ్‌గేజ్ లైన్ నిర్మాణం జరుగుతుండగా.. రూ.1160.47కోట్లు వెచ్చిస్తున్నారు. ఉత్తర తెలంగాణ అభివృద్ధిలో ఈ రైల్వేలైన్ కీలక మలుపుగా మారనుంది. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి ఇప్పటి వరకు రోడ్డు మార్గమే ఆధారం. ఈ లైన్ వల్ల సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి మనోహరాబాద్ మీదుగా కొత్తపల్లి వరకు, అక్కడి నుంచి పెద్దపల్లి గ్రాండ్ ట్రంక్ లైన్‌తో అనుసంధానం కానుంది. ప్రస్తుతం సిద్దిపేట వరకు ప్రస్తుతం రైలు కూడా నడుస్తున్న సంగతి తెల్సిందే. తాజాగా రింగు రైలు ప్రాజెక్ట్ నేపథ్యంలో గజ్వేల్ స్టేషన్ ఈ లైన్‌తో అనుసంధానం కానుంది. దీని ద్వారా నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్లకు గజ్వేల్ స్టేషన్ ప్రత్యామ్నాయంగా మారడానికి అడుగులు పడనున్నాయి. ఈనేపథ్యంలో కొన్ని ప్రధానమైన రైళ్లు ఇక్కడి నుంచే నడిచే అవకాశాలున్నాయి. గజ్వేల్ నుంచి వెళ్తున్న ట్రిపుల్‌ఆర్ పక్కనే నిర్మించిన ఈ రైల్వేస్టేషన్.. యథాతథంగా రింగు రైలుకు కూడా అనుసంధానం కానుంది.

మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కు అభివృద్ధికి దోహదం

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పరికిబండ శివారులో రూ.996 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కు (బహుళవిధ సరుకు రవాణ సేవల సముదాయం) అభివృద్ధికి ఈ రింగు రైలు ప్రాజెక్ట్‌తో బాటల పడనున్నాయి. ఈ లైన్‌తో లాజిస్టిక్ అనుసంధానమయ్యే అవకాశాలుండటం వల్ల ఇక్కడి నుంచి సరుకు రవాణా సేవలు దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు విస్తరించరించుకునే అవకాశం కలగనుంది. ఇదే కాదు.. ఉమ్మడి మెదక్ జిల్లాలోని తూప్రాన్, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు ప్రాంతాల్లో రైలు రవాణా ఆధారిత అభివృద్ధి వేగవంతం కానుంది. మహా నగరానికి పొరుగు జిల్లాలతో మెరుగైన రైలు రవాణా వ్యవస్థ ఏర్పడనుంది. దీంతో రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకునే అవకాశాలున్నాయి.

మొక్కలు నాటి సంరక్షించాలి

నర్సాపూర్ రూరల్: మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం 100 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వన మహోత్సవంలో కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులతో కలిసి 500 మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాల కోసం మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేశ్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి, విద్యార్థులు

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి


లింగంపల్లి పోచవ్వ

అక్కన్నపేట(హుస్నాబాద్): బట్టలు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన అక్కన్నపేట మండలం కుందనవానిపల్లిలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లింగంపల్లి పోచవ్వ(75) ఒంటరిగానే ఉంటోంది. బట్టలు ఉతికి తీగపై ఆరేస్తుండగా.. ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలొదిలింది. అటువైపుగా వెళుతున్న ఓ వ్యక్తి చూసి పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందజేశారు. వారు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ: భరోసా కేంద్రంలో సపోర్ట్ పర్సన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మహిళలకే ప్రాధాన్యత ఉంటుందని, మహిళలు, పిల్లల పట్ల జరిగే వేధింపుల కేసులలో బాధితులకు మద్దతు ఇవ్వడమే లక్ష్యంగా పనిచేసే ఒక సేవాభావంతో కూడిన పదవని తెలిపారు. దరఖాస్తుదారులు సోషల్ వర్క్, చైల్డ్ డెవలప్‌మెంట్, సైకాలజీలో పీజీ డిగ్రీ చేసి ఉండాలన్నారు. 21 నుండి 45 యేళ్ల మధ్య వయస్సు కలిగి ఉన్న స్త్రీలు మాత్రమే అర్హులన్నారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో హాజరు శాతం నమోదు

జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జిన్నారం: గుమ్మడిదల మున్సిపాలిటీ బొంతపల్లి, దోమడుగు ఉన్నత పాఠశాల్లో గురువారం జరిగిన కాంప్లెక్స్ సమావేశాలను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సంవత్సరం ఇంటర్మీడియెట్ మార్కులు ఉండవని, వంద మార్కుల ప్రశ్నలకు రాయాలని, అందుకు తగిన విధంగా విద్యార్థులను తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి పాఠశాలలో గ్రంథాలయానికి సంబంధించిన ఒక పిరియడ్‌ను కేటాయించాలన్నారు. అలాగే గడ్డపోతారం మున్సిపాలిటీలోని చెట్ల పోతారం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశాలను ఎంఈవో కుమారస్వామి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు గ్రీన్ సిగ్నల్

హుస్నాబాద్: నియోజకవర్గంలో క్రీడా సదుపాయాల కల్పనకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్జ్) గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు జిల్లా క్రీడా అధికారి జంగపల్లి వెంకటనర్సయ్య తెలిపారు. హుస్నాబాద్ మినీ స్టేడియంలో 200 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణం, ఫ్లడ్ లైట్లు అమర్చడం, కొత్తగా స్కేటింగ్ రింగ్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఇండోర్ స్టేడియం వుడెన్ కోర్టును సింథటిక్, పైకా భవనంలో అధునాతన మల్టీ జిమ్ ఏర్పాటు చేయనున్నారు. కోహెడ, ఎల్కతుర్తి మండలాల్లో కొత్తగా మినీ స్టేడియం నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆదేశించినట్లు పేర్కొన్నారు.

మీసేవకు మరో 9 సర్వీసులు

- ఇక నుంచి ఎక్కడైనా.. ఎప్పుడైనా కుల ధ్రువీకరణ
- పారదర్శకత.. ప్రజలకు మరింత దగ్గరగా సేవలు
- పేపర్‌లెస్‌కు ప్రభుత్వం ప్రాధాన్యత


మెదక్‌లోని మీ సేవ కేంద్రం

మెదక్ కలెక్టరేట్: ప్రజలు కాగితాలు పట్టుకొని కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా ప్రభుత్వం పేపర్‌లెస్ విధానాన్ని మరింత వేగవంతం చేస్తుంది. ఇందులో భాగంగా ప్రజలు తమ సమస్యలపై రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా మీ-సేవల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడుతుంది. ప్రజాపాలన మరింత పారదర్శకంగా చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా పేపర్‌లెస్ సేవలందిస్తున్న మీ-సేవకు ప్రభుత్వం కొత్తగా మరో 9 సేవలను అప్పగించింది. రెవెన్యూ, మున్సిపాలిటీ, పంచాయతీరాజ్‌లకు సంబంధించిన సేవలను మాత్రమే మీసేవ కేంద్రాలు అందిస్తున్నాయి. కొత్తగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నుంచి ఒకటి, అటవీశాఖ నుంచి రెండు, రెవెన్యూశాఖ నుంచి ఆరు రకాల సేవలను ప్రభుత్వం మీసేవలో పొందుపర్చింది. దీంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యాయనే చెప్పాలి.

పాన్‌కార్డులో మార్పులు.. చేర్పులు

ప్రస్తుతం చాలా మంది ప్రజలు తమ పాన్ కార్డులలో తప్పులు దొర్లడంతో వాటి మార్పులు, చేర్పుల కోసం సరైన సమాచారం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎలా చేసుకోవాలో తెలియక నానా హైరానా పడుతున్నారు. పాన్‌కార్డు సెంటర్ల చుట్టూ తిరిగి తిరిగి అలసి పోతున్నారు. ప్రభుత్వం నూతనంగా మీసేవ ద్వారానే పాన్‌కార్డులో మార్పులు చేర్పులు చేసుకునే సర్వీస్‌ను అమలులోకి తీసుకొస్తుంది. దీంతో పాన్‌కార్డు సమస్యలతో బాధపడుతున్న ప్రజల సమస్యకు పరిష్కారం దొరకనుంది.

అటవీశాఖకు సంబంధించి..

- అటవీ జంతువుల దాడిలో చనిపోయి. మనుషులు, పశువులకు పరిహారం దరఖాస్తులు
- కట్టెల మిల్లులు, కట్టెల డిపోలకు సంబంధించిన దరఖాస్తులు
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నుంచి సీనియర్ సిటిజన్ మెయింటెన్స్, మానిటరింగ్ సిస్టం దరఖాస్తులు మీసేవలో ప్రభుత్వం పొందు పర్చింది. ప్రజలు తమ కావాల్సిన పత్రాల కోసం మీసేవ ద్వారా దరఖాస్తు సమర్పిస్తే చాలు. నిర్ణీత సమయంలోనే ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చు.

సేవలు ఇలా..

అత్యధికంగా రెవెన్యూ శాఖ నుంచి

- విద్యార్థులకు చదువుకు సంబంధించి స్టడీ గ్యాప్ సర్టిఫికెట్
- స్థానిక ధృవీకరణ పత్రాలు
- కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు
- పేరు మార్పు ధ్రువీకరణ
- ఉన్నత విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు క్రిమిలేయర్, నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్
- హిందూ మ్యారేజ్ ధ్రువీకరణ పత్రం
- వ్యవసాయేతర భూముల మార్కెట్ విలువ ధ్రువీకరణ పత్రం
- ఇసుక బుకింగ్ సేవలను మీ సేవలో అందుబాటులోకి వస్తున్నాయి

ఎప్పుడైనా.. ఎక్కడైనా..



ప్రజలు తమ కుల ధ్రువీకరణ పత్రం కోసం ఒక్కసారి దరఖాస్తు చేసుకొని తహసీల్దార్ ద్వారా మంజూరు చేస్తే చాలు. దాని ద్వారా ఎప్పుడైనా, ఎక్కడైనా ఎన్నిసార్లు అయిన దరఖాస్తుదారుడు కుల ధ్రువీకరణ పత్రం పొందవచ్చు. ఈ అవకాశాన్ని ప్రభుత్వం నూతనంగా మీసేవలో పొందు పరుస్తుంది.

–సందీప్, ఈడీఎం, మెదక్

అన్ని సర్వీసులు రావడం లేదు



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్ని సర్వీసులైనా అందించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 9 సర్వీసులు ఓపెన్ కావడం లేదు. ప్రభుత్వం వెంటనే ఈ సర్వీస్‌లు అందుబాటులోకి తీసుకురావాలి. జిల్లాలో మొత్తం 63 మీసేవలు ఉండగా.. ప్రస్తుతం 350 రకాల సర్వీసులను అందిస్తున్నాం.

–రాజు, మీ సేవ నిర్వాహకుడు, మెదక్

గుర్తింపు కోసం న్యాక్ కావాలి

- దుబ్బాక డిగ్రీ కళాశాలను సందర్శించిన చెక్ బృందం
- పలు సూచనలు, సలహాలు ఇచ్చిన సభ్యులు


న్యాక్ చెక్ బృందానికి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్ భవానీ

దుబ్బాక: న్యాక్ గుర్తింపు కోసం దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం ఓయూ చెక్ బృందం పరిశీలించింది. ఉస్మానియా యూనివర్సిటీ చెక్ ప్రాజెక్టులో భాగంగా కొలాబరేషన్ విత్ క్రిస్ప్ పైలెట్ ప్రాజెక్టు కింద మూడు రాష్ట్రాలను ఎంపిక చేశారు. ఓయూ పరిధిలోని 22 కళాశాలలను ఎంపిక చేయగా.. ఇందులో దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒకటి. సీఆర్ఐసీపీ రెప్రజెంటేటీవ్ ప్రొఫెసర్ రమాదేవి, మెంటార్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణల బృందం కళాశాలను సందర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని డిగ్రీ కళాశాలల ప్రమాణాలను మెరుగుపర్చేందుకు న్యాక్ అక్రిడిటేషన్ మార్పులు తీసుకొచ్చిందన్నారు. న్యాక్ ప్రమాణాల మేరకు వనరులను ఏ విధంగా మలుచుకోవచ్చో వివరించారు. దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్య శిక్షణ తరగతులు, సర్టిఫికెట్ కోర్సుల నిర్వహణ, విద్యార్థుల డిజిటల్ లైబ్రరీ వినియోగం, బోధనలో ఐసీటీ వనరుల వినియోగం తదితర విధానలను అవలంబిస్తుండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమాల పత్రాలను సమగ్రంగా తయారు చేసినట్లయితే న్యాక్ గుర్తింపు సులువుగా సాధించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భవానీ కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకట్‌రెడ్డి, నాగేశ్వర్ రావు, స్వాతి, సునీత, వెంకటేశ్వర్లు, రఘునందన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులపై కేసు కొట్టివేత


హర్షం వ్యక్తం చేస్తున్న గౌరవెల్లి భూ నిర్వాసితులు

అక్కన్నపేట(హుస్నాబాద్): భూ నిర్వాసితులపై నమోదైన కేసును సిద్దిపేట జిల్లా కోర్టు కొట్టివేసింది. 2022లో అప్పటి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట గౌరవెల్లి భూ నిర్వాసితులు ఆందోళన చేయగా.. 17మందిపై కేసు నమోదైంది. అందులో నలుగురు నిర్వాసితులైన తిరుపతిరెడ్డి, శంకర్‌రెడ్డి, రాగి శ్రీనివాస్ తదితరులు 42 రోజులు జైలులో ఉండి కండీషన్ బెయిల్‌పై వచ్చారు. మూడేళ్లుగా ఈ కేసు సిద్దిపేట జిల్లా కోర్టుకు హాజరవుతూ వస్తున్నారు. కాగా, సరైన సాక్ష్యాలు లేని కారణంగా భూ నిర్వాసితులపై నమోదైన కేసును కొట్టివేసినట్లు న్యాయమూర్తి తెలిపారు. దీంతో భూ నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు.

పెండింగ్ కేసుల పరిష్కారం

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య


మాట్లాడుతున్న సౌజన్య

సంగారెడ్డి టౌన్: నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీతో కోర్టులలో పెండింగ్ కేసులను పరిష్కరించుకోవడానికి అవకాశం ఉందని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. గురువారం సంగారెడ్డిలోని జిల్లా కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 90 రోజుల మధ్యవర్తిత్వ డ్రైవ్‌తో కేసులు పరిష్కారం అవుతాయన్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించుకోవడానికి న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

బురదలో పడి రైతు మృతి

రామాయంపేట(మెదక్): ప్రమాదవశాత్తు బురదలో పడి ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఝాన్సిలింగాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ బాల్‌రాజ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన నల్ల రమేశ్ (53) గురువారం ఉదయం చేపలు పట్టడానికి గాను చెరువు వద్దకు వెళుతున్న క్రమంలో ఒడ్డుపై నుంచి బురద నేలపై బోర్ల పడిపోయాడు. విషయం తెలుసుకొని కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా, అప్పటికే రమేశ్ మృతి చెందాడు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


జేఎన్టీయూ ఆవరణలో సైకిల్ తొక్కుతున్న దామోదర

సైకిల్ తొక్కిన దామోదర

సంగారెడ్డి: జేఎన్టీయూ ఆవరణలో మంత్రి దామోదర రాజనర్సింహ సైకిల్ తొక్కారు. గురువారం విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేశారు. అనంతరం తాను స్వయంగా సైకిల్ తొక్కి అందరినీ ఆశ్చర్యపరిచారు. అనంతరం జేఎన్టీయూలోని ప్రహరీగోడ నిర్మాణాన్ని పరిశీలించారు. సుల్తాన్‌పూర్‌లోని కస్తూర్బా హాస్టల్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. అక్కడే ఆస్పత్రి నిర్మాణం, పోలీస్‌స్టేషన్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆందోల్ ఆర్డీఓ పాండు తదితరులు పాల్గొన్నారు.

తోపులాట.. గందరగోళం


బీఆర్ఎస్ కార్యకర్తల తోపులాట


కింద పడిపోయిన కేకులు

- కేటీఆర్ రాకతో కార్యకర్తల అత్యుత్సాహం
- సీఎం సీఎం అంటూ నినాదాలు

పటాన్‌చెరు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్నారన్న సమాచారంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పోచారం నల్లబాలు అలియాస్ శశిధర్‌గౌడ్ ఇంటి వద్దకు కేటీఆర్ వస్తున్నారన్న సమాచారం మేరకు కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. కేటీఆర్ రాగానే ఒక్కసారిగా సీఎం, సీఎం అంటూ నినాదాలు చేస్తూ దూసుకొచ్చారు. దీంతో కేటీఆర్ జన్మదిన సందర్భంగా కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేకు, తోపులాటలో కింద పడిపోయింది. అయితే.. కార్యకర్తలకు అభివాదం చేస్తూ కేటీఆర్ వెళ్లారు. కాగా, కేటీఆర్ వెంట కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పటాన్‌చెరు నియోజకవర్గం బీఆర్ఎస్ కో–ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి, కార్పొరేటర్లు వి.సింధు, మెట్టు కుమార్, మాజీ జెడ్పీటీసీలు శ్రీకాంత్ గౌడ్, బాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, వెంకటేష్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

నలుగురు దొంగల అరెస్టు

- డీఎస్పీ నరేందర్‌గౌడ్ వెల్లడి
- 13 తులాల బంగారం, రూ.1.24 లక్షల నగదు స్వాధీనం


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

చిన్నశంకరంపేట(మెదక్): పలు గ్రామాల్లో చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ తెలిపారు. చిన్నశంకరంపేటలో దొంగతనాల కేసులకు సంబంధించిన వివరాలను గురువారం మీడియాకు వెల్లడించారు. మండలంలోని ఖాజాపూర్‌లో పది రోజుల క్రితం చిగుల్ల మల్లయ్య ఇంటి తాళం పగులగొట్టి బంగారంతో పాటు నగదు చోరీ జరిగింది. అదే గ్రామంలో పలు ఇళ్లలో వరుసగా చోరీలు జరిగాయి. గురువారం తెల్లవారు జామున పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. మహిపాల్, మాలమహేశ్, కరుణాకర్, భూపాల్ అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా.. తాము దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వివరించినట్లు డీఎస్పీ తెలిపారు. ఖాజాపూర్‌లోని పాతూరి లక్ష్మణ్, మాల మహిపాల్ ఇంట్లో, బ్యాంకుమిత్ర షాపులో దొంగతనాలు చేసినట్లు చిగుల్ల మల్లయ్య ఇంట్లో దొంగిలించిన బంగారు నగలు హైదరాబాద్‌లో గుర్తు తెలియని వ్యక్తులకు అమ్ముకుంటున్నట్లు నిందితులు వివరించారు. వారి వద్ద నుంచి 13 తులాల బంగారం, కిలో వెండి, రూ.1.24 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసు ఛేదించిన సీఐ వెంకట్‌రాజాగౌడ్, చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణ, సిబ్బందిని ఆయన అభినందించారు.

డ్రైవర్, క్లీనర్ అరెస్టు


నిందితులను చూపుతున్న సీఐ వెంకటరాజాగౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): కారును ఢీకొట్టి వ్యక్తిపై నుంచి లారీని దూసుకెళ్లిన డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం నార్సింగి మండలం వల్లూర్ శివారులో ఓ కారు ఢీకొట్టి అదే కారులో ఉన్న సత్తిరెడ్డి అనే వ్యక్తి లారీని నిలిపేందుకు ప్రయత్నించగా.. అతడిపై నుంచి లారీ తీసుకెళ్లడంతో సత్తిరెడ్డి మృతిచెందాడు. తూప్రాన్ శివారులో లారీ వదిలిపోయిన నిందితుడు గురువారం లారీ తీసుకెళ్లేందుకు రాగా రాజస్తాన్‌కు చెందిన డ్రైవర్ మోయిన్, క్లీనర్ హసీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆటకట్టు

- ముగ్గురి అరెస్టు.. పరారీలో మరో ముగ్గురు
- రూ.1.52 కోట్ల పల్లాడియం స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి జోన్: తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలలోని ఫార్మా కంపెనీలలో పల్లాడియం దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఆరుగురు ముఠా సభ్యుల్లో ముగ్గురిని అరెస్టు చేయగా.. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని చెప్పారు. గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహారాష్ట్రలోని పూణె జిల్లా పాంధరేవాడికి చెందిన అమోల్ బాపు జాగడే, మహారాష్ట్రలోని భిగ్వాన్‌కు చెందిన రవీంద్ర భగవాన్ భడర్, మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లాలోని కలేపడల్‌కు చెందిన గణేష్ మహాదేవ్ రాథోడ్‌తో పాటు సాంబశివుడు, అక్షయ్ చవాన్, లాలాపాటిల్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. సాంబశివుడు పూణెలోని ఫార్మా కంపెనీలలో పని చేయటంతో పల్లాడియం విలువపై పూర్తి అవగాహన కలిగి ఉన్నాడు. దీనిని ఆధారం చేసుకుని తప్పుడు మార్గంలో అక్రమంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. కంపెనీలలో పల్లాడియం కార్బన్ దొంగతనం చేసుకుని రావాలని, దానిని అమ్మగా వచ్చిన డబ్బులతో సమానంగా పంచుకుందామని నిర్ణయించుకున్నారు. పూణెలో పని మానేసి హైదరాబాద్‌లోని ఫార్మా కంపెనీల గురించి, తెలుసుకుని అక్కడి స్టోర్ సిబ్బందికి డబ్బులు ఆశ చూపించి, కంపెనీ మెటీరియల్ సమాచారం తెలుసుకునేవారు. ఈ విధంగా జిల్లాలోని ఐడీఏ బొల్లారం, గుంటపల్లి, గుమ్మడిదల, సదాశివపేటతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలలో వరుస దొంగతనాలకు పాల్పడ్డారు.

బొల్లారం పరిశ్రమ ఫిర్యాదుతో..

గత సంవత్సరం ఐడీఏ బొల్లారం పరిధిలోని ఎస్.వి. కో–ఆపరేటివ్ ఇండస్ట్రియల్ రాంపెక్స్ పరిశ్రమలో పల్లాడియం కార్బన్ దొంగతనం జరగటంతో పరిశ్రమ ఏజీఎం కామేశ్వర శర్మ ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు.. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నమ్మదగిన సమాచారం మేరకు గురువారం ఉదయం 6గంటల సమయంలో కాజిపల్లి చౌరస్తాలోని ఓఆర్ఆర్ సమీపంలో అమోల్ బాపు జాగడే, రవీంద్ర భగవాన్ భడర్, గణేష్ మహాదేవ్ రాథోడ్‌లను అదుపులోకి తీసుకున్నారు. ముఠాలోని మిగతా ముగ్గురు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. వారి నుంచి 38కిలోల పల్లాడియం కార్బన్‌తో పాటు హూండాయ్ క్రెటా కారు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పల్లాడియం విలువ రూ.1కోటి 52లక్షలు ఉంటుందన్నారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులకు అభినందించి, రివార్డులు ప్రకటించారు. ఈ సమావేశంలో పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐలు శివకుమార్, రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పక్క చెత్తతో దుర్వాసన

నర్సాపూర్: రోడ్ల పక్కన పారవేసిన చెత్త కుళ్లి దుర్వాసన వస్తుంది. నర్సాపూర్ మెదక్, నర్సాపూర్ సంగారెడ్డి రహదారుల పక్కన ఉన్న దేవాలయ భూములు ఉన్నాయి. పట్టణంలోని కొందరు వ్యాపారులతో పాటు కొందరు మున్సిపల్ సిబ్బంది చెత్తను రోడ్డు పక్కన ఉన్న దేవాలయ భూములలో పారవేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కాగా సంగారెడ్డి మార్గంలోని దేవాలయ భూములలో కుక్కల కళేబరాలు, చెత్త, తేమగా ఉండే వ్యర్థాలు పారవేయడంతో అవి కుళ్లిన అనంతరం వాటి నుంచి దుర్వాసన వస్తుందని , దుర్వాసన రావడంతో చెత్త పారవేసిన ప్రాంతం నుంచి వెళ్లలాంటె ఇబ్బందిగా ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళేబరాలు, చెత్త రోడ్ల పక్కన పారవేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆయా శాఖల అధికారులను కోరుతున్నారు.

మందు బాబులు.. మారరా..?

- కేసులు నమోదు అయినా కనిపించని మార్పు
- ప్రమాదాల బారిన పడుతున్న మద్యం ప్రియులు
- సుమారు 1400 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు


జహీరాబాద్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జహీరాబాద్ టౌన్: నెల రోజుల క్రితం ఓ యువకుడు మద్యం మత్తులో బైక్‌ను అతివేగంగా నడిపి అల్లీపూర్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి.

ఏప్రిల్ నెలలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పటాన్‌చెరువు ఎస్ఐ. నాగలక్ష్మిని మందుబాబులు కారుతో ఢీకొట్టారు. ఆమెకు గాయాలు కావడంతో వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు.

కొంత మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండడంతో ప్రమాదాలు జరిగి వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. అతి వేగంగా.. అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల ఇతర వాహనదారులూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కొంత మందికి గాయాలు కాగా మరి కొంత మంది చనిపోతున్నారు. ప్రమాదాల నియంత్రణకు పోలీస్‌శాఖ డ్రంకెన్ అండ్ డ్రైవ్ చేపట్టింది. బ్రీత్ ఎనలైజర్లతో ఆల్కహాల్ పరీక్ష చేసి మద్యం తాగిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానతో పాటు శిక్ష పడేలా చేస్తుంది. అయితే.. రహదారి ప్రమాదాలను అరికట్టడానికి జిల్లాలో ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసుల ద్వారా మందుబాబులకు దడ పుట్టిస్తున్నారు. తాగి వాహనం నడుపుతూ తనిఖీలో పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. కోర్టులో హాజరుపరుస్తుండగా న్యాయమూర్తులు నిందితులకు జరిమానతో పాటు జైలు శిక్ష కూడా విధిస్తున్నారు. అయినా మందుబాబుల్లో ఏ మాత్రం మార్పు కనిపించడం లేదు.

అన్ని రకాల ఇబ్బందులే..

మద్యం సేవించడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. తనిఖీల్లో పట్టుబడితే కేసులు, జైలు శిక్ష పడుతుంది. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే రూ. 2 వేల నుంచి రూ.15 వేల వరకు జరిమాన పడుతుంది. మొదటి నేరానికి రూ.10 వేల జరిమాన లేదా 6 నెలల జైలు శిక్ష పడుతుంది. లేదా రెండూ విధించవచ్చు. మూడు సంవత్సరాల లోపు రెండోసారి నేరం చేస్తే రూ.15 వేల జరిమాన లేదా రెండు సంవత్సరాల జైలు శిక్ష పడతుంది. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్ కోల్పోయే అవకాశం కూడా ఉంది.

ప్రతి రోజు 200 కేసులు

జిల్లాలో సగటున ప్రతి రోజు 200 వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు అవుతున్నాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు సుమారు 1,400 కేసులు నమోదు అయ్యాయి. డిసెంబర్ 31 ఒక్క రోజే 282 కేసులు నమోదు అయ్యాయి. కేసులతో పాటు జరిమాన, జైలు శిక్షలు కూడా పడ్డాయి.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



మద్యం సేవించి వాహనాలు నడపొద్దు. మద్యం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రమాదాల నివారణ కోసం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం.

–వినయ్ కుమార్, ఎస్ఐ జహీరాబాద్ టౌన్